సాక్షి
కాకినాడ
శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



సమగ్ర వివరాలు అందించండి

ఎస్సీ ఉప కులాల స్థితిగతులపై సమగ్ర వివరాలు అందించాలని ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశించారు.


8లో



రూ.లక్ష విరాళం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో అన్నదానానికి గున్నపు సత్యవతి (సామర్లకోట) తన మనవడు ప్రదీప్‌కుమార్ పేరిట గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 11,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు గురువారం 11,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వీటిలో తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.20 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

అన్నవరం: పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సత్యదేవుని ఆలయ ప్రాంగణం గురువారం కిక్కిరిసిపోయింది. టూరిస్టు బస్సులు, వివిధ వాహనాల్లో శబరిమల వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో సత్యదేవుని దర్శించుకున్నారు. వీరికి ఇతర భక్తులు కూడా తోడవడంతో ఆలయ ప్రాంగణంలో రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం ప్రాంగణం, వ్రత మండపాలు భక్త జనసందోహంతో నిండిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. స్వామి వారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. సత్యదేవుని వ్రతాలు 1,200 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

సత్యదేవుని నిజరూప దర్శనం

రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుడు భక్తులకు నిజరూపంలో దర్శనమిచ్చారు. ప్రతి రోజూ పట్టు వస్త్రాలు, స్వర్ణ, వజ్రాభరణాలతో దర్శనమిచ్చే స్వామి, అమ్మవారు, శంకరుల మూలవిరాట్టులను పుష్పమాలలతో మాత్రమే అలంకరించారు.

నేడు చండీ హోమం

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ హోమం, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. రూ.750 టికెట్టుతో భక్తులు ఈ హోమంలో పాల్గొనవచ్చు.

శ్రీపాద శ్రీవల్లభుని హుండీ ఆదాయం రూ 22 లక్షలు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పిఠాపురం: పట్టణంలోని ప్రముఖ దత్త క్షేత్రమైన శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి హుండీల ద్వారా రూ 22,05,551 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యాన గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. గత జూన్ 29 నుంచి ఇప్పటి వరకూ ఈ ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఏలేరులో 20.86 టీఎంసీల నీటి నిల్వలు



ఏలేరులో నీటినిల్వలు

ఏలేశ్వరం: పరివాహక ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా తగ్గాయి. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, గురువారం 84.93 మీటర్లుగా నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 20.86 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. ఆయకట్టుకు 800, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపా, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదలను నిలిపివేశారు.

నేటి నుంచి ఆర్టీసీ కార్గో మాసోత్సవాలు

కాకినాడ: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు శుక్రవారం నుంచి జనవరి 19 వరకూ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్గోలో కేజీ నుంచి 50 కేజీల బరువు వరకూ బుక్ చేసిన వస్తువులను 10 కిలోమీటర్ల వరకూ డోర్ డెలివరీ చేస్తామన్నారు. ఆర్టీసీ కార్గో సేవలపై మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అభివృద్ధా? ఆధిపైత్యమా?

- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఫ్లెక్సీల రగడ
- పవన్ కల్యాణ్ ఫొటో లేదని జనసేన ఆందోళన
- ఆయన ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఆస్పత్రి అధికారులు
- చంద్రబాబు ఫొటో చిన్నదిగా వేశారంటూ కార్యక్రమాన్ని బహిష్కరించిన టీడీపీ నేత వర్మ
- ఇదే రాజకీయమంటూ నివ్వెరపోయిన వైద్యాధికారులు



ఎవరి ఫొటో లేకుండా ఆస్పత్రి వర్గాలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పిఠాపురం: టీడీపీ – జనసేన ఆధిపత్య పోరు పిఠాపురం ప్రభుత్వాస్పత్రి సాక్షిగా మరోసారి బయటపడింది. అభివృద్ధికి సంబంధించిన అసలు విషయాన్ని పక్కన పెట్టేసి.. ఎవరికి వారే తమ ఆధిపత్యం నిరూపించుకోడానికి చేసిన ప్రయత్నం రచ్చ రచ్చగా మారింది. దీనికి సంబంధించిన వివరాలివీ..

పిఠాపురంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఇటీవల జీఓ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సీహెచ్‌సీకి కొత్తగా అభివృద్ధి కమిటీని నియమించారు. ఇందులో జనసేన నుంచి బొజ్జా సతీష్, టీడీపీ నుంచి వేణుం సురేష్‌లను నియమించారు. వీరి ప్రమాణ స్వీకారోత్సవం గురువారం సీహెచ్‌సీలో ఏర్పాటు చేశారు. దీని కోసం సిద్ధం చేసిన వేదికపై ఆస్పత్రి వర్గాలు ఏ రాజకీయ నాయకుడి ఫొటోలూ లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ తమ తమ అనుచరులతో వచ్చారు. వేదికపై స్థానిక ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో లేకుండా ఫ్లెక్సీ పెట్టడంపై జనసేన నేతలు ఆందోళనకు దిగారు. దీంతో, ఆస్పత్రి వైద్యాధికారులు వెంటనే పవన్ కల్యాణ్ ఫొటోతోపాటు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఫొటోలతో మరో ఫ్లెక్సీ తయారు చేయించి, స్టేజిపై ఏర్పాటు చేశారు. పక్కనే వర్మ, మర్రెడ్డి శ్రీనివాస్ ఫొటోలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కూడా ఏర్పాటు చేశారు. అయితే, అది అక్కడెందుకంటూ జనసేన కార్యకర్తలు ఆ ఫ్లెక్సీని తీసి పక్కన పడేశారు.

దీనిపై వర్మ ఆగ్రహించారు. అయితే, తన ఫొటో ఉన్న ఫ్లెక్సీ పక్కన పడేశారనే విషయాన్ని ప్రస్తావించకుండా.. వేదికపై ఉన్న ఫ్లెక్సీలో చంద్రబాబు ఫొటో చిన్నదిగా వేశారంటూ నిలదీశారు. దీంతో ఈసారి టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. కావాలనే చంద్రబాబు ఫొటో చిన్నదిగా వేశారని ఆస్పత్రి వర్గాలతో వర్మ వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిని అదుపు చేయలేని పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో వర్మ తమ సభ్యుడు వేణుం సురేష్‌తో కలిసి సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. ఒక ముఖ్యమంత్రికి విలువ ఇవ్వడం ఆస్పత్రి అధికారులకు తెలియదని, 100 పడకల ఆస్పత్రిగా జీఓ ఇచ్చింది చంద్రబాబేనని, ఆయనను ఇలా కించపర్చడం, అవమానించడం పెద్ద తప్పుగా భావిస్తున్నామని ఆయనన్నారు.

వర్మ వెళ్లిపోయాక ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నేతగా బొజ్జా సతీష్‌తో ప్రమాణ స్వీకారం చేయించి, సమావేశాన్ని ముగించారు. ఇరు పార్టీల ఫ్లెక్సీల గొడవతో మధ్యాహ్నం జరగాల్సిన ఈ కార్యక్రమం సాయంత్రం వరకూ వివాదాలతో కొనసాగింది. సీఎం చంద్రబాబు ఫొటో చిన్నదిగా వేయడం వల్ల కాదని, ఫ్లెక్సీపై తన ఫొటో వేయనందువల్లే వివాదం సృష్టించి వర్మ వెళ్లిపోయారని జనసేన నేతలు వ్యాఖ్యానించడం కొసమెరుపు. నాయకుల అర్థం లేని ఆందోళనలతో ఏం చేయాలో తెలియక నివ్వెరపోవడం ఆస్పత్రి వైద్యాధికారుల వంతయ్యింది.



సమావేశం వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నేతలు

కుక్కుటేశ్వరా.. మన్నించు

- పాదగయ క్షేత్రంలో ఆగని అపచారాలు
- తాజాగా ప్రసాదంలో పురుగులు
- గతంలోనూ వరుస ఘటనలు
- విచారణలతోనే సరిపెడుతున్న అధికారులు
- మండిపడుతున్న భక్తులు





పిఠాపురం పాదగయ క్షేత్రం, ప్రసాదంలో పురుగులు రావడంపై ఇటీవల విచారణ చేస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు, డీసీ రమేష్‌బాబు. చిత్రంలో ఈఓ శ్రీనివాస్

పిఠాపురం: పవిత్ర పాదగయ క్షేత్రంలో వరుసగా అపచారాలు జరుగుతున్న పట్టించుకుంటున్న వారే లేకుండా పోయారు. సనాతన ధర్మానికి కేరాఫ్‌గా చెప్పుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇలాకా.. పిఠాపురంలోని సుప్రసిద్ధ కుక్కుటేశ్వర స్వామి క్షేత్రంలోనే.. వరుసగా చోటు చేసుకుంటున్న అపవిత్ర ఘటనలు భక్తులను కలవరపరుస్తున్నాయి.

దేశంలోని మూడు గయా క్షేత్రాల్లో ఒకటి.. అష్టాదశ శక్తి పీఠాల్లో పదోది.. త్రిమూర్తి స్వరూపుడైన దత్తాత్రేయ స్వామి అవతారంగా భక్తులు కొలిచే శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మస్థలంగా ప్రసిద్ధి చెందిన దివ్యభూమి పిఠాపురం. ఇంతటి ప్రసిద్ధి పొందిన ఈ పట్టణంలో కొలువైన పాదగయ క్షేత్రాన్ని దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు కొన్ని రోజులుగా కాసులు కురిపించే ఆలయంగా మాత్రమే చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయ ప్రతిష్టను దెబ్బ తీసేలా వరుసగా అపచారాలు జరుగుతున్నా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు.

అపచారాల పరంపర

- ఇటీవల మహిళా అఘోరీని కుక్కుటేశ్వరస్వామి వారి గర్భగుడిలోకి అనుమతించారు. దీనిపై హిందూ సంఘాలు భగ్గుమన్నాయి. నిబంధనలకు విరుద్ధగా వివస్త్రగా ఉన్న ఆమెను ఆలయంలోకి ఎలా అనుమతించారని ఆలయ అధికారులపై భక్తులు మండిపడ్డారు.
- ఇటీవలి కార్తిక మాసోత్సవాల సమయంలో అన్య మతస్తుడిని ఆలయంలో నియమించారు. ఆ వ్యక్తితో ఏకంగా మూలవిరాట్టుకు అభిషేకాలు చేసే పాలు అందజేసే పనులు చేయిస్తూండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విశ్వ హిందూ పరిషత్ నాయకులు సైతం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.
- ఇటీవల పాదగయ క్షేత్రం దత్తాత్రేయ మండపంలోని యజ్ఞ వేదికలో ఆలయ రసీదు పుస్తకాలు వేసి, దహనం చేయడం తీవ్ర దుమారం రేపింది. పవిత్రమైన ఆలయ అగ్నిగుండంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి చిత్రాలు ఉన్న పుస్తకాలు వేసి, దహనం చేయడంపై భక్తులు తీవ్రంగా మండిపడ్డారు.
- తాజాగా స్వామి వారి పవిత్ర ప్రసాదంలో పురుగులు వచ్చాయి. దీనిపై భక్తుల ఫిర్యాదు మేరకు దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్‌జేసీ) సుబ్బారావు, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు మంగళవారం విచారణ నిర్వహించారు. అయితే, ఈ ఘటనకు బాధ్యత వహించాల్సిన ఈఓను పక్కన కూర్చోబెట్టుకుని విచారణ చేయడంపై భక్తుల నుంచి విమర్శలు వచ్చాయి. ఈ విచారణ సందర్భంగా జనసేన నేతలు పాదగయలో తిష్ట వేయడం పైనా విమర్శలు వచ్చాయి.
- భాద్రపద మాసంలో వచ్చే పితృపక్షంలో వేలాదిగా ప్రజలు తమ పితృదేవతాలకు పాదగయ క్షేత్రంలో పిండ ప్రదానాలు నిర్వహించారు. ఆ సందర్భంగా తమ విశ్వాసం ప్రకారం పిండాలను ఆలయ పుష్కరిణిలో కలిపేవారు. దీనిని ఎప్పటికప్పుడు శుభ్రపరచకపోవడంతో పుష్కరిణి జలాలు దుర్గంధభరితంగా మారాయి. పితృపక్షం ముగిసిన అనంతరం ఆశ్వయుజ మాసం ప్రారంభమై, శరన్నవరాత్ర ఉత్సవాలు మొదలయ్యాయి. ఆ సమయంలో పుష్కరిణి జలాలను తొలగించే పని చేపట్టారు. దీంతో శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పాదగయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసే అవకాశం లేకుండా పోయింది.
- ఆలయంలో ఇలా వరుస అపచారాలు జరుగుతున్నా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నిష్పక్షపాతంగా విచారణ జరపాలి



కాశీ తరువాత అంతటి పుణ్యస్థలిగా భావించే పవిత్ర పుణ్యక్షేత్రం పాదగయలో ఇన్ని అపచారాలు, అధర్మాలు జరుగుతున్నా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణల పేరుతో కాలక్షేపం చేయడం అనుమానించాల్సిన విషయం. ఆలయంలో ఎవరి వల్ల తప్పులు జరుగుతున్నా ఈఓ బాధ్యత వహించాల్సి ఉంటుంది. వరుస అపచారాలపై విచారణలు చేయడం తప్ప తగిన చర్యలు తీసుకున్న ఆనవాళ్లు లేవు. కింది స్థాయి సిబ్బందిని బలి చేయడం ఎంత వరకూ సమంజసమో ఉన్నతాధికారులే చెప్పాలి. ప్రసాదాన్ని ఎంత పవిత్రంగా చూడాలి? నిత్యం పరిశీలించి నాణ్యతను గుర్తించాల్సిన అధికారి సరిగ్గా పట్టించుకోకపోతే ఇలాగే తప్పులు జరుగుతూంటాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా కఠినమైన చర్యలు తీసుకోవాలి. లేకుంటే భక్తులు ఉద్యమించే పరిస్థితి వస్తుంది.

– కొండేపూడి శంకరరావు, సామాజిక కార్యకర్త, పిఠాపురం

లోటుపాట్లు లేకుండా చర్యలు

పాదగయ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తాం. ఇటీవల వరుసగా జరుగుతున్న ఘటనలపై పకడ్బందీగా విచారణలు జరిపి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం. నేను కొత్తగా బాధ్యతలు తీసుకోవడం వల్ల కొన్ని విషయాలు ఇంకా తెలుసుకోవాల్సి ఉంది.

– కాట్న జగన్మోహన్ శ్రీనివాస్, ఈఓ, పాదగయ

పారదర్శకంగా విచారణ

విచారణ పారదర్శకంగానే నిర్వహించాం. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– సుబ్బారావు, దేవదాయ శాఖ ఆర్‌జేసీ

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు కొత్త అధ్యక్షులు



కాకినాడ: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాలకు నూతన అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకాలను ప్రకటించింది. వివిధ నియోజకవర్గాల్లో క్రియాశీలకంగా పని చేస్తున్న పలువురిని ఎంపిక చేసి, నూతన కమిటీలను ప్రకటించారు. జిల్లా బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడిగా ఒమ్మి రఘురామ్ (జగ్గంపేట), వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా మేడిశెట్టి రమణ (బుజ్జి) (పెద్దాపురం), జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా లంకా ప్రసాద్ (తుని) నియమితులయ్యారు. జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షునిగా చింతల రాజు (ప్రత్తిపాడు), క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా దడాల జాషువా (కాకినాడ రూరల్), విద్యార్థి విభాగం అధ్యక్షునిగా పూసల అనిల్ (కాకినాడ రూరల్), గ్రీవెన్స్ సెల్ విభాగం అధ్యక్షునిగా తోటకూర శ్రీనివాస్(కాకినాడ రూరల్)లను నియమించారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి చెందిన ఇల్లి రాజబాబు (బీసీ సెల్), ఎండీ బాషా (మైనార్టీ సెల్), బాదం మధుసూదనరావు(వాణిజ్య విభాగం), ఆదిత్య కుమార్ (లీగల్ సెల్), పేపకాయల కృష్ణప్రియ (సోషల్ మీడియా సెల్), డాక్టర్ మల్లిక్ (డాక్టర్ల సెల్) జిల్లా అధ్యక్షులుగా నియమితులయ్యారు. అలాగే మహిళా విభాగం అధ్యక్షురాలిగా వర్ధినీడి సుజాత(పిఠాపురం), దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వమ్మి గురవయ్య(పిఠాపురం)లను నియమించారు.

జనసేన ఇన్‌చార్జికి చేదు అనుభవం




మర్రెడ్డి శ్రీనివాస్‌ను అడ్డుకున్న మత్స్యకారులు

- కోనపాపపేటలో అడ్డుకున్న మత్స్యకారులు
- ఆందోళనలు చేస్తున్నప్పుడు కన్నెత్తయినా చూడలేదమని నిలదీత

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఆయన ప్రతినిధిగా ఉన్న జనసేన పార్టీ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు చేదు అనుభవం ఎదురైంది. తీర ప్రాంత మత్స్యకారుల సమస్యలపై ఆందోళన చేస్తున్నా.. ఏనాడైనా గ్రామంలోకి వచ్చారా అంటూ ఆయనను యు.కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామ శివారు కోనపాపపేటలో స్థానిక మత్స్యకారులు అడ్డుకున్నారు. దీంతో ఆయన కొంతసేపు కారులోనే ఉండిపోవాల్సి వచ్చింది. అల్పపీడనం ప్రభావంతో సముద్ర కోతకు గురైన కోనపాపపేట తీర ప్రాంతాన్ని పరిశీలించేందుకు గురువారం శ్రీనివాస్ ఆ గ్రామానికి వచ్చారు. తీరంలో ఏర్పాటు చేసిన పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలను పైపులైన్ల ద్వారా సముద్రంలోకి విడుదల చేయడంతో మత్స్య సంపద అంతరించిపోతోందని, మత్స్యకారులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్య సంపద అంతరించిపోతే మత్స్యకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుందని అన్నారు. పరిశ్రమలకు వ్యతిరేకంగా తాము ఆందోళనలు చేస్తున్నా తమ గ్రామం వైపు ఏనాడైనా కన్నెత్తి చూశారా అని శ్రీనివాస్‌ను మత్స్యకారులు నిలదీశారు. ఓట్లు వేయడానికేనా మత్స్యకారులు అని నిలదీశారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే కోతకు గురవుతున్న తీర ప్రాంతానికి శాశ్వత రక్షణ చర్యలు చేపడతామన్న పవన్ కల్యాణ్ మాటలు ఏమయ్యాయని సూటిగా ప్రశ్నించారు ఈ విషయాలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇవ్వడంతో శ్రీనివాస్‌ను మత్స్యకారులు విడిచిపెట్టారు.

ప్రసాద్.. మరింత జాప్యం

- రత్నగిరిపై నిర్మాణాల టెండర్లు రద్దు
- ఈ నెలలో మరోసారి పిలిచే అవకాశం
- గతంలో దాఖలు చేసిన 12 సంస్థలు
- ఇప్పటి వరకూ తెరవని పర్యాటక శాఖ
- కూటమి మంత్రి సన్నిహితునికి కట్టబెట్టేందుకే ఆలస్యమంటూ గతంలోనే విమర్శలు



అన్నవరం: దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం ప్రారంభించిన పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీము పనులు మరింత జాప్యం కానున్నాయి. వైఎస్సార్ సీపీకి చెందిన అప్పటి కాకినాడ ఎంపీ వంగా గీత, నాటి ప్రజాప్రతినిధుల చొరవతో అన్నవరం దేవస్థానం గతంలోనే ప్రసాద్ పథకానికి ఎంపికైంది. ఈ పదేళ్లలో ఎన్నో అవాంతరాలు దాటుకుని, చివరకు సుమారు రూ.20 కోట్లతో రత్నగిరిపై వివిధ నిర్మాణాలు చేపట్టేందుకు కేంద్రం పచ్చజెండా ఊపింది.

'ప్రసాద్'తో చేపట్టే పనులివీ..

- ప్రసాద్ నిధులతో అన్నవరం దేవస్థానంలో పలు పనులు చేపట్టాలని గతంలోనే నిర్ణయించారు. ఆ మేరకు గత మార్చి ఏడో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి ఈ పనులకు లాంఛనంగా శ్రీకారం చుట్టారు.
- దేవస్థానంలోని పాత టీటీడీ భవనం స్థలంలో రూ.10 కోట్లతో రెండంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మించాలని నిర్ణయించారు.
- అలాగే, ప్రస్తుత అన్నదాన భవనం పక్కనే రూ.6 కోట్లతో క్యూ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశారు.
- ప్రకాష్ సదన్ భవనం వెనుక ఉన్న ప్రస్తుత పార్కింగ్ స్థలంలో అటు సత్యగిరి, ఇటు రత్నగిరికి దగ్గరగా ఉండేలా రూ.3 కోట్లతో పురుషులు, మహిళలకు విడిగా టాయిలెట్ల బ్లాక్‌లు నిర్మించాలని నిర్ణయించారు.
- అదే విధంగా సత్రాల వద్ద నుంచి ఆలయానికి, వ్రత మండపాల మధ్య భక్తులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రూ.కోటితో రెండు బ్యాటరీ కార్లు నడపాలని ప్రణాళిక రూపొందించారు.

టెండర్ల రద్దు అందుకేనా!

ఈ పనుల కోసం గత అక్టోబర్ 3న టెండర్లు పిలిచారు. అదే నెల 25న ఈ టెండర్లు తెరచి, ఖరారు చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ ఆ పని జరగలేదు. ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జరిగిన ఈ టెండర్ల ప్రక్రియలో టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించి, ఫైనాన్షియల్ బిడ్‌లో లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన వారికే ఈ టెండర్లు ఖరారు చేయాలి. ఈ టెండర్లలో 12 ప్రముఖ నిర్మాణ సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో ఒకటి రాష్ట్ర మంత్రికి చెందిన సంస్థ అని, దానికి ఈ టెండర్లు కట్టబెట్టేందుకే రాష్ట్ర పర్యాటక అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని గతంలో విమర్శలు వచ్చాయి. అయితే, నిధులు విడుదల కాకపోవడమే టెండర్లు తెరవకపోవడానికి ప్రధాన కారణమని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. తాజాగా నిధులు విడుదలయ్యాయని, అయితే గత టెండర్లు కాలపరిమితి ముగిసినందున వాటిని రద్దు చేసి, మళ్లీ పిలవనున్నామని అంటున్నారు.

మళ్లీ పిలుస్తాం

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీమ్ టెండర్లకు సంబంధించి నిధులు విడుదల చేస్తూ, ఈ నెల 2న ఆదేశాలు జారీ అయ్యాయి. పాత టెండర్లు తెరవడానికి సమయం మించిపోయింది. అందువలన ఉన్నతాధికారులతో చర్చించి, పాతవి రద్దు చేసి, కొత్తగా మళ్లీ టెండర్లు పిలుస్తాం.

– ఈశ్వరయ్య, ఇన్‌చార్జి సీఈ, పర్యాటక శాఖ